క్లుప్తంగా

ప్రమాదవశాత్తు పత్తి దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్)లోని ఆర్కే కాటన్ మిల్లులో బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు పత్తి దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. మిల్లు గోదాంలో పొగలు రావడంతో కూలీలు నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఫైర్ స్టేషన్‌కు తెలియజేయగా ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు.

కేసీఆర్‌ను కలిసిన నాయకులు



కేసీఆర్‌ను కలిసిన నాయకులు

హుస్నాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హుస్నాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, పార్టీ బలోపేతం కోసం పని చేయాలని కేసీఆర్ సూచించినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో వంగ వెంకట్రాంరెడ్డి, గొర్ల వీరన్న యాదవ్, శ్రీనివాస్ నాయక్ ఉన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కూటిగల్ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం హుస్నాబాద్ డివిజన్ విద్యుత్‌శాఖ డీఈ కృష్ణయ్య మండల విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు అవసరమైన స్థలాన్ని ఎంపికచేసి అప్పజెప్పితే నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. చేర్యాల ఏడీఈ వెంకట్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దాతలను స్ఫూర్తిగా తీసుకోవాలి



ఎల్ఈడీని ప్రారంభిస్తున్న ఎంఈఓ

నంగునూరు(సిద్దిపేట): పాఠశాలకు సహాయం అందించి ఉదారతను చాటుకున్న దాతలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. తిమ్మాయిపల్లికి చెందిన చల్లారం పద్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి తన తల్లి బాలవ్వ జ్ఞాపకార్థ ప్రాథమికోన్నత పాఠశాలకు వాటర్‌ఫిల్టర్, ఎల్ఈడీ టీవీ, విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. హెచ్ఎం సుశాంత్‌కుమార్, సంపత్, నర్సింహులు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

సిద్దిపేటరూరల్: కొమురవెల్లి మండలం అయినాపూర్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి చేస్తున్న అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల నాయకుడు తేలు ఇస్తారి కలెక్టరేట్ ఏఓకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూలుకు రెండు పుస్తకాలు వాడుతూ ఒక్కటి మాత్రమే ప్రభుత్వానికి చూపుతున్నారన్నారు. పాత పెండింగ్ బిల్లుల పేరుతో పంచాయతీ నిధులు దండుకుంటున్నారని ఆరోపించారు. గ్రామానికి పర్మినెంట్ కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి



ధనుష్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: నిమోనియా బారినపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ధాతర్‌పల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జూపల్లి బాలయ్య-సంతోష దంపతుల చిన్న కుమారుడు ధనుష్(8) అస్వస్థతకు గురవ్వడంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. కానీ ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి నీలోఫర్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పది రోజులుగా చికిత్స పొందుతున్న ధనుష్ పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. బాలుడి మృతితో బాధిత కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

తిరుగులేని 'పొద్దుతిరుగుడు'

- యాసంగిలో ఎంతో మేలు
- తక్కువ నీటితో పంట సాగు
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు
- వ్యవసాయ అధికారి శ్రీనాథ్



పొద్దుతిరుగుడు సాగుచేసిన రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: రైతులు యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు. వానాకాలం వరి సాగుచేసిన రైతులు యాసంగిలో నీటి లభ్యతను అనుసరించి వరికి బదులు ఆరుతడి పంటలు సాగు చేస్తుంటారు. ఈ క్రమంలో యాసంగిలో స్వల్ప కాలిక పంటైన పొద్దుతిరుగుడు సాగుచేస్తే తక్కువ నీటి వినియోగంతో పాటు తక్కువ సమయంలో పంట చేతికి వస్తుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులకు లాభసాటి

సంప్రదాయ పంటలు కాకుండా వాణిజ్య పరంగా మంచి ధర లభించే పంటలను సాగు చేసుకోవడం ద్వారా రైతులకు మంచి లాభాలు వస్తాయని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో యాసంగిలో వాణిజ్య పరంగా మంచి డిమాండ్ ఉన్న పొద్దుతిరుగుడు సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ సూచించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలలో సాగు చేస్తున్న పొద్దుతిరుగుడు పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ రైతులు పాటించాల్సిన యాజమాన్య మెలకువలపై అవగాహన కల్పిస్తున్నారు.

విత్తే సమయం

పొద్దుతిరుగుడు పంట 100–110 రోజులలో పూర్తవుతుంది. రబీలో నవంబరు- డిసెంబరు నెల్లోను, నీటి పారుదల కింద సాగుచేసుకునే వారు జనవరి మూడో వారం నుంచి ఫిబ్రవరి రెండో వారం వరకు విత్తుకోవచ్చు. సాళ్ల మధ్య 45సెం.మీ, మొక్కల మధ్య 30సెం.మీ ఎడం పాటించాలి. ఎకరానికి రెండు కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. వరి తరువాత పొద్దు తిరుగుడు వేసుకునే వారు డిసెంబరు ఆఖరి వారం నుంచి జనవరి మొదటి వారం వరకు విత్తుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం

పొద్దుతిరుగుడు పంటలో ఎరువుల యాజమాన్యం ముఖ్య పాత్ర వహిస్తుంది. మంచి దిగుబడులు సాధించడానికి మొదటి దఫాగా విత్తిన తర్వాత నత్రజని 50శాతం (35 కిలోల యూరియా) తరువాత రెండో దఫాగా విత్తిన 30రోజుల తరువాత మొగ్గ తొడిగే దశలో 25శాతం (18 కిలోల యూరియా), మూడో దఫాగా 50రోజుల తరువాత పువ్వు వికసించే దశలో 25శాతం (18 కిలోల యూరియా) ఎకరానికి వేసుకోవాలి.

కలుపు నివారణ కోసం

విత్తిన 30–40 రోజుల వరకు పంటలో కలుపు లేకుండా చూసుకోవాలి. దీనివల్ల మొక్కలు మంచిగా పెరుగుతాయి. కలుపు నివారణ కోసం లీటరు నీటికి పెండిమిథాలిన్30శాతం ఈసీ ద్రావణాన్ని 5మి.లీ కలుపుకొని విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు పిచికారీ చేసుకోవాలి. విత్తిన 20–25 రోజుల తరువాత గొర్రుతో అంతరకృషి చేయాలి. లేదా ఫినాక్సిప్రాప్ ఇథైల్/ క్విజలోఫాప్ ఇథైల్ 1.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం ద్వారా గడ్డిజాతి కలుపును నివారించవచ్చు.

- భాస్వరాన్ని సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో 150 కిలోలు, పొటాష్ 20 కిలోలు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.
- ఎరువు వేసేటప్పుడు నేలలో తగినంత తేమ ఉండేటట్లు చూసుకోవాలి.
- గంధకం తక్కువగా ఉన్న నేలల్లో ఎకరాకు 10కిలోల గంధకాన్ని జిప్సం రూపంలో(55 కిలోలు) ఎకరాకు వేస్తే నూనె శాతం పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చు.
- 2గ్రాముల బోరాక్స్ లీటరు నీటికి చొప్పున కలిపి పైరు పూతదశలో (ఆకర్షక పత్రాలు వికసించే దశలో) ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణం పిచికారీ చేయాలి. దీని వల్ల గింజ బాగా కడుతుంది.
- బోరాక్స్ పౌడర్‌ను మొదట వేడి నీటిలో కరిగించి తగినంత ద్రావణం తయారు చేయాలి. లేదా ఆఖరి దుక్కిలో ఎకరాకు 8కిలోల చొప్పున బోరిక్ ఆమ్లాన్ని వేసుకోవడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చు.

ప్రభుత్వాన్ని నిలదీస్తే తప్పుడు కేసులా?

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందువల్లే మాజీ మంత్రి హరీశ్‌రావుపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. గజ్వేల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరీశ్‌రావు ఫోన్ ట్యాపింగ్ చేయించారని కేసు బనాయించడం సిగ్గుచేటన్నారు. హరీశ్‌రావుకు దానితో ఏమి సంబంధం ఉందని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష నేతల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, మాజీ జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్ఎస్ నేతలు మధు, నవాజ్‌మీరా, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ఉమర్, స్వామిచారి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

భూ ప్రకంపనలతో కలకలం

- పలు మండలాల్లో స్వల్ప భూకంపం
- పలువురి ఇళ్లలో కింద పడ్డ సామగ్రి
- పరుగులు తీసిన ప్రజలు



హుస్నాబాద్‌లో బయటకు వచ్చిన జనం

హుస్నాబాద్/అక్కన్నపేట(హుస్నాబాద్)/బెజ్జంకి(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం స్వల్పంగా భూమి కంపించింది. ఉదయం 7.27 గంటల ప్రాంతంలో భూ ప్రకంపనలు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. 3–4 సెకన్లు భూ ప్రకంపనలు కలకలం సృష్టించాయి. హుస్నాబాద్‌లో కుర్చీలు కదలడం, ఇంట్లోని వస్తువులు కింద పడ్డాయి. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పట్టణం నుంచి 40కి.మీ పరిధిలో ఈ భూ ప్రకంపనలు సంభవించాయని అధికారులు తెలిపారు. అక్కన్నపేట మండలంలోని రామవరం, మోత్కులపల్లి, దుబ్బతండా పరిధిలోని రాజుతండాలతో పాటు పలు గ్రామాల్లో ఒక్కసారిగా భూమి అదరడంతో జనం ఉలిక్కిపడ్డారు. ఇంటిపై కప్పు రేకులు, ఇళ్లలోని వస్తువులు కింద పడటంతో ప్రజలు పరుగులు పెట్టారు. మూడు సెకండ్ల పాటు భూమి కంపించిందని స్థానికులు తెలిపారు. బెజ్జంకితో పాటు పలు గ్రామాలలో 3–4 సెకన్లు భూమి కంపించింది. పాపన్నపల్లె గ్రామానికి చెందిన దోనె వెంకటేశ్ ఇంట్లో సజ్జల పైన వున్న దుస్తులు, సామగ్రి కింద పడినట్టు తెలిపాడు. అదేవిధంగా మిరుదొడ్డి మండలంలోని ధర్మారంలో నాలుగు సెకండ్ల పాటు భూమి కంపించడంతో జనాలు భయంతో బయటకు వచ్చారు. మునుపెన్నడూ లేని విధంగా భూమిలో కదలికలు రావడంతో చర్చానీయాంశంగా మారింది.

చిన్నారులకు గుండె వ్యాధుల చికిత్సలే లక్ష్యం

- చైల్డ్ హార్ట్ కేర్ సెంటర్ చైర్మన్ శ్రీనివాస్



చైల్డ్ హార్ట్ కేర్ సెంటర్‌ను సందర్శించిన ఫెర్నాండెజ్ ఆసుపత్రి ప్రతినిధులు

కొండపాక(గజ్వేల్): పుట్టుకతోనే చిన్నారుల్లో వచ్చే గుండె సంబంధిత వ్యాధులకు చికిత్సలుచేసే లక్ష్యంతో సత్యసాయి సంజీవని ఆసుపత్రి ఏర్పాటైందని ఆసుపత్రి చైర్మన్ శ్రీనివాస్ చెప్పారు. కొండపాక శివారులో ఆనంద నిలయం సమీపంలో ఏర్పాటైన సత్యసాయి సంజీవని ఆసుపత్రిని హైదరాబాద్‌కు చెందిన ఫెర్నాండెజ్ ఆసుపత్రి సంస్థల ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఆసుపత్రిలో ఇటీవల చిన్న పిల్లలకు జరిగిన గుండె ఆపరేషన్ల విషయమై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 30వరకు ఆరు రోజుల్లో 18మంది చిన్నారులకు, మూడు రోజుల కిందట మరో తొమ్మిది మంది పిల్లలకు నిర్వహించిన గుండె శస్త్రచికిత్సలు విజయవంతం అయ్యాయని చెప్పారు. ఆయా చిన్నారుల తల్లిదండ్రులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అనఘ తులసి, భూషణ్, అమితా వర్మ, జగన్నాథశర్మ, గణేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- నూతన చట్టాలతో మహిళలకు ప్రాధాన్యం
- పోలీస్ అధికారులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాట్లాడుతున్న సీఐ దుర్గ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్)/గజ్వేల్‌రూరల్: సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ దుర్గ, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సెల్‌ఫోన్ ద్వారా అనేక ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్‌నేరాలు జరిగిన వెంటనే 100, 1930కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రొబిషన్ ఎస్ఐ తోటపల్లి రేణుక విద్యార్థులకు డ్రగ్స్ వాటి అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. హెచ్ఎం జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ రామస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ పిలుపునిచ్చారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్ ఫ్రీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాకటౌన్: స్థానిక కేజీబీవీలో ఖాళీగా ఉన్న హిందీ, సోషల్ సబ్జెక్టులు బోధించేందుకు గెస్టు మహిళా టీచర్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి స్వాతి తెలపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బీఎడ్, టెట్ పాసైనవారు ఈ నెల 7వరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

7నుంచి సీఎం కప్ క్రీడలు

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామస్థాయి సీఎం కప్ పోటీలు 7, 8వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి గణేశ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో 10 నుంచి, 12వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ క్రీడల్లో పాల్గొనే వారు ఆయా గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్ హరికిషన్, ఎంపీడీఓ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పాఠశాలల్లో న్యాస్ సర్వే

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులలో సామర్థ్యాన్ని పరీక్షించేందుకు నిర్వహించే న్యాస్ పరీక్షలను బుధవారం బెజ్జంకి మండలంలో నిర్వహించినట్లు ఎంఈఓ మహతిలక్ష్మి తెలిపారు. 3, 6, 9వ తరగతులకు చెందిన 52మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. రేగులపల్లె ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి, సత్యసాయి గురుకుల పాఠశాలలో 9వ తరగతి, విద్యానికేతన్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారన్నారు. పరిశీలకులుగా ఎండీ అమీర్ షరీఫ్, వేణుగోపాల్, శివశంకర్, ఇన్విజిలేటర్లుగా జబీర్‌శరీన్, మాధవి, పావని, శివరాజు వ్యవహరించారు.

మందుబాబులకు జరిమానా

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 28 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రియాంక 28 మందికి రూ.17వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డల క్షేమం



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ డీడబ్ల్యూఓ శారద

- ఐసీడీఎస్ జిల్లా డీడబ్ల్యూఓ శారద

కొండపాక(గజ్వేల్): పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారని ఐసీడీఎస్ జిల్లా డీడబ్ల్యూఓ శారద అన్నారు. మండల పరిధిలోని బందారంలో అంకిరెడ్డిపల్లి, వెంకటాపూర్, తిమ్మాయిపల్లి, బందారం గ్రామాల్లోని గర్భిణులకు అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శారద ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఎదుట గ్రామస్తుల నిరసన



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడిన తమ గ్రామస్తులకు న్యాయం చేయాలని గుర్రాలగొంది మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ హరీశ్, మండల నాయకులు ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం మల్యాల చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వారికి న్యాయం చేయాలని గ్రామస్తులు సిద్దిపేట డిపోకు వెళ్లగా అధికారులు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. దీంతో గ్రామస్తులు బుధవారం డిపో ఎదుట బైఠాయించారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. గాయపడిన వారు చికిత్స చేయించుకోలేని స్థితిలో ఉన్నారని, వారికి బస్సు యజమాని కాని, ఆర్టీసీ యాజమాన్యం కాని చికిత్స చేయించాలని నాయకులు కోరారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత



సంఘీభావ సభలో హిందూ ఐక్యవేదిక నాయకులు

సిద్దిపేటకమాన్: సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హిందూ ఐక్యవేదిక నాయకులు, ఇస్కాన్ ప్రతినిధి కృష్ణదాస్ అన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద బుధవారం సంఘీభావ సభ నిర్వహించారు. పలు రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో చిన్మయ కృష్ణను అక్కడి ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పేకాట స్థావరంపై దాడి

మద్దూరు(హుస్నాబాద్): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు దాడిచేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు బుధవారం ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. దూళ్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచరం మేరకు మంగళవారం దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు చెప్పారు. వారి నుంచి రూ.4,780 నగదు, ఆరు మొబైల్ ఫోన్లు, ఆరు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

◆ బాక్సింగ్ విజేతకు అభినందన

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని నల్ల శివాని బాక్సింగ్ పోటీల్లో కాస్య పతకాన్ని సాధించిందని ఎంఈఓ సత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్ నుంచి ఇటీవల టెన్నీకాయిట్ హ్యాండ్ బాల్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. పీఈటీ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

◆ ప్రాథమిక స్థాయి నుంచే సామర్థ్యాలు

కొండపాక(గజ్వేల్): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లి, కాశనగర్ తదితర పాఠశాలలను బుధవారం సందర్శించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.

◆ కనీస వేతనాల కోసం వినతి

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీలో పని చేస్తున్న దినసరి కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ మాట్లాడుతూ 80 మంది కార్మికులకు రూ.10వేలలోపు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజయ్య, కవిత, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

◆ గురుకుల పాఠశాల పరిశీలన

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని లింగరాజుపల్లిలోని మహాత్మా పూలే గురుకుల పాఠశాలను ఎంఈఓ గజ్జెల కనకరాజు బుధవారం సందర్శించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలని, తాజా కూరగాయలతో నాణ్యమైన ఆహారం అందించాలని కార్మికులకు సూచించారు. ప్రిన్సిపాల్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యాదాతకు సన్మానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన రిటైర్డు ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి పదేళ్లుగా తమ సొంత గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛందంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. బుధవారం పాఠశాలకు వచ్చిన డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి తమ సేవలను గుర్తించి శాలువా కప్పి సత్కరించారు.

◆ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పోతారం, గుగ్గిల్ల గ్రామాలలో ఏర్పాటుచేసే ఇథనాల్ ఫ్యాక్టరీల వల్ల వచ్చే వ్యర్థాలతో ప్రమాదముందని, వాటి అనుమతులు రద్దుచేయాలని బీఆర్ఎస్ నాయకులు తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వాటి వ్యర్థాలు కాలువల గుండా తోటపెల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో కలిసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

◆ హాస్టళ్లను సందర్శించిన తహసీల్దార్

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక బీసీ, ఎస్సీ హాస్టళ్లను బుధవారం రాత్రి తహసీల్దార్ జయలక్ష్మి ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాల్లోని రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వసతులు ఉన్నాయా.. చలి దుప్పట్లు ఉన్నాయా. బాగా చదువుకుంటున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

◆ పంచాయతీలో వేలం పాటలు

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామ పంచాయతీలో పలు అంశాలకు పంచాయతీ కార్యదర్శి హరీశ్ ఆధ్వర్యంలో బుధవారం వేలం పాటలు నిర్వహించారు. మల్లన్న ఆలయ సమీపంలో వాహనాల పార్కింగ్ లైసెన్స్ కోసం గ్రామానికి చెందిన సిలివేరు కనకమల్లేశం రూ.19.31లక్షలకు అధిక పాటపాడి దక్కించుకున్నారు. సులభ్ కాంప్లెక్స్ తై బజార్ నిర్వాహణకు సరియైన పాట రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు కార్యదర్శి ప్రకటించారు.

◆ ఐయూసీ జిల్లా కార్యదర్శిగా రామకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇండియన్ యూత్ కాంగ్రెస్(ఐయూసీ) జిల్లా కార్యదర్శిగా తాను ఎన్నికయినట్లు చేర్యాల రామకృష్ణ తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎన్నికలలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనట్టు బుధవారం ఆయన పేర్కొన్నారు. సహకరించిన మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఐయూసీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

◆ అన్నదానానికి రూ.లక్ష విరాళం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి హన్మకొండకు చెందిన భక్తులు ఆడపు కుమారస్వామి జ్ఞానేశ్వరి దంపతులు బుధవారం ఆలయ అధికారులకు రూ.1,00,116లను విరాళం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఆలయ పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

◆ వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా జరుగుతున్న ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవం, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రాదాలు స్వీకరించారు. ఈఓ విశ్వనాథ్ శర్మ, చైర్మన్ రమేష్ విష్ణు, అర్చకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.